

## ఈవారం కథ

# పిల్లలే (నా) సర్వస్వం?

ఎమ్. హేమలత









"అనూ! అనూ!!" అంటూ కేకేసారు అన్నం కలుపుకుంటూ విశ్వనాథంగారు.

"నెయ్యి–ఇక్కడే వున్నది నాన్న గారూ...!" అంటూ నెయ్యి గిన్నెను అందించింది పూర్ణిమ.

"నెయ్యి కోసరం కాదమ్మా...మీ అందరికీ ఓ శుభవార్త చెప్పాలి. అందుకే పిలిచాను మీ అమ్మని..." అని విశ్వనాథంగారు అంటూ వుండగానే, అప్పడాలు వడియాలు పట్టుకొని ప్రత్యక్షమైంది అన్నపూర్ణ.

హడావిడిగా అన్నంతింటున్న మురళి, మేగజీన్ని ఒళ్ళో పెట్టుకొని చదువుతూ, అన్నాన్ని నంజుతున్న కుమార్ తలెత్తి నాన్నగారి వేపు చూసారు ఆసక్తిగా.

"ఏంటండీ...పిలిచారు?" అంటూ అన్నపూర్ణ తన కంచాన్ని ముందుకు లాక్కుని కూచుంది కుర్చీలో.

"అది కాదోయ్! మా కంపెనీ వాళ్ళు ప్రతి సంవత్సరం దీపావళికి బోనసుగా ఇస్తారుగా..."

"ఓహో...అది వచ్చింది కాబోలు...ఎవ్విరి ఇయర్ వచ్చేదేగా డాడీ. ఇందులో గొప్ప ఎక్సైట్‌మెంటు ఏముందీ...!" నాన్నాడు మురళి.

"మామూలు బోనస్ కాదోయ్ చవట దద్దమ్మా! ఈ ఏడు కంపెనీకి బాగా లాభాలొచ్చాయి. అందుకని ఆరు నెలల జీతం బోనస్ క్రింద ఇచ్చారు..." ఆనందంగా చెప్పకుపోతున్న ఆ ఇంటి పెద్ద వంక ఆశ్చర్యంగా చూసారు కుటుంబ సభ్యులు.

"అంటే...ఆరవై వేలన్నమాట...!" నమ్మమంటారా–అన్నట్టు నాన్నగారి కేసి చూసింది, పుత్రికా రత్నం పూర్ణిమ.

"ఔనమ్మా..."

"నాన్నా! అయితే నేను సింగపూర్ ట్రిప్ ఖాయం చేసుకోవచ్చన్న మాట. చేసుకోమంటారా... నాన్న గారూ...?" కుర్చీని నాన్నగారి వేపుకు తిప్పతూ అడిగాడు మురళి.

"సింగపూర్ ట్రిప్పా...అదేంటోయ్...!"

5-5-95 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

"ఏంటి నాన్నగారూ! అప్పడే మర్చిపోయారా... మా ఫ్రెండ్స్ అందరం కల్సి ఎన్నాళ్ళనుండో ప్లాన్ చేస్తున్నాముకదా...సింగపూర్ ట్రిప్..."

"మురళీ! నీ సింగపూర్ ట్రిప్పకిపుడేం తొందరొచ్చిందిరా...మీ బావగార్కి ఆఫీసు దూరమై బస్సులో వెళ్ళి రావడానికి నానా తిప్పలు పడుతున్నారు. నాన్నగారు బోనస్ డబ్బులు పెట్టి ఆయనకి స్కూటర్ కొనిస్తారు... కదండీ నాన్నగారూ?" అంటూ ముద్దు ముద్దుగా గునిసింది పూర్ణిమ. పురిటికి పుట్టింటికి వచ్చి పండంటి పాపాయిని ఎత్తుకుంది. నేడో-రేపో భర్తని చేరబోతున్న పూర్ణిమ భర్తకి బహుమతిగా ఒక స్కూటర్‌ని పట్టుకుపోదామని కలలుకంటోంది.

ఇంటర్ చదువుతున్న కుమార్ మాత్రం-ఏం తక్కువ తిన్నాడు? "నాన్నగారూ...! బావకేనేంటి స్కూటర్ అవసరం. నేనూ మెడికల్ కాలేజిలో చేరేసరికి నాకూ కావాలి స్కూటర్" అంటూ తన పాయింట్‌ని ప్రవేశపెట్టాడు.

వారి వారి కోర్కెలను వెలిబుచ్చి ఒకరినొకరు శత్రువుల్లాగా చూసుకుంటున్న సంతానాన్ని చూచి ఇక వూర్కోదలచుకోలేదు విశ్వనాథంగారు.

"నేను చెప్పేది పూర్తిగా వినిపించుకోకుండా మీరిలా మొదలెట్టే ఎలాగ...? ఆ బోనస్ డబ్బుతో మీ అమ్మ-నేనూ ఆలిండియా టూర్ పోయి రావాలని నిశ్చయించుకున్నాము. పాపం మీ అమ్మ ఎప్పటి నుండో అంటూంది తీర్థయాత్రలు పోవాలని..." భర్త మాటలకి విస్తుపోయి చూసింది అన్నపూర్ణ. తనెప్పడో సరదాకి పుణ్యక్షేత్రాలు చూసి రావాలన్న కోర్కెని భర్త అమలుపెట్టానవడం ఆమెకి సంతోషం కల్గించినా...పిల్లల కోర్కెలను అనుకుంటే అది తీర్చడమే సబబు అనుకుంది.

కుమార్ చాలా అసంతృప్తిగా వార్తాపత్రికని టేబిల్ మీద పడేసి లేచిపోయాడు. పాప లేచిందంటూ చరచరా వెళ్ళిపోయింది పూర్ణిమ. విసురుగా డైనింగ్ టేబుల్‌ని దాటి వెళ్తున్న మురళిని బాధగా చూస్తూ కూచుంది అన్నపూర్ణ అన్నాన్ని వేళ్ళతో కెలుకుతూ.

"అదేంటి అనూ! పెరుగు పోసుకో..." అంటూ మళ్ళీ వచ్చి కూచున్నారు, భార్య కెదురుగా విశ్వనాథంగారు. ఉలిక్కిపడి భర్త చేతిలోని పెరుగు గిన్నెను అందుకుంది అన్నపూర్ణ.

"ఏం...! పిల్లలకన్నా నువ్వే చాలా దిగులుగా వున్నావ్...?" వడియం ముక్కని త్రుంచి నోట్లో వేసుకుంటూ అన్నారు విశ్వనాథంగారు.

"పిల్లలు కదండీ పాపం! వాళ్ళ కోర్కెలు మనం కాక ఇంకెవరు తీరుస్తారు. పోనీ, మనం మళ్ళీ సంవత్సరం వెళ్దాం యాత్రలకి..." అనునయంగా మాట్లాడుతున్న భార్యకేసి కోపంగా చూసారు విశ్వనాథంగారు.

"పిల్లలు...పిల్లలు...మొదటి నుంచి నీకీమాట తప్ప మరో మాట రాదు. పిల్లల సుఖం గురించి నీకేకాని నాకు తెలీదా?"

> **నిషా ఖరీదు**
>
> "రాత్రి పార్టీ అయ్యేసరికి చాలా పొద్దుపోయింది. దారి వెంబడి ఓ టాక్సీ పోతుంటే లిఫ్ట్ అడిగి ఇంటికొచ్చాము. తీరా టాక్సీ దిగాక వాడు పదిహేను రూపాయిలు ఇమ్మన్నాడు.
>
> "ఏం చేస్తాం... ఈ రోజుల్లో ఎవరికీ పెద్దతరహా లేకుండా పోతోంది"
>
> "అతన్నేమీ అనకు. తప్పనాదే. నిషాలో గమనించలేదు. అది అద్దె టాక్సీ"
>
> — కె.వి.మధుసూదనరావు

"తల్లిదండ్రుల బాధ్యత కదండీ అది..." మధ్యలో అడ్డుకుంది అన్నపూర్ణ.

"ఔను...బాధ్యతే...నేను మాత్రం కాదంటున్నానా...? దేనికయినా ఒక హద్దుండాలి-అంటాను నేను. మన విషయం కూడా ఆలోచించుకోవాలి. ముఖ్యంగా-ఇల్లాలివైన నిన్ను సుఖపెట్టడం లేదేమో అన్న బాధ కల్గుతూంటుంది తెలుసా నాకు."

"అబ్బబ్బ! మీ పట్టుదల మీదేకానీ ఇతరుల విషయం ఆలోచించరు కదా! యాత్రల విషయం ప్రస్తావించేటప్పడు పిల్లల ముఖాలు ఎంత చిన్నబోయాయో గమనించారా? వాళ్ళని చిన్నబుచ్చి మనమిలా వెళ్ళక పోతేనేమి?"

"పిల్లలు చిన్నబుచ్చుకున్నారని-ఓ... నీవు ఇంతలా బాధపడ్తున్నావు కానీ అమ్మని సంతోషపెట్టామని వాళ్ళలో ఏ ఒక్కరైనా ఆలోచించారా....?"

"అది లోక సామాన్యమండీ! మనం ఇప్పడు మన బిడ్డల కోసం ప్రాకులాడినట్లే రేపు వాళ్ళు వాళ్ళ పిల్లల కోసం తాపత్రయ పడ్తారు."

"ఊహూ! లోక సామాన్యం. ఎంత బాగా విశ్లేషించావ్! మన కన్నపిల్లలకి మనమీద ప్రేమ లేకపోవడం ఎంత సామాన్య విషయంగా మాట్లాడుతున్నావ్...!"

"ఔనండీ! మీరు నిదానంగా ఆలోచిస్తే మీకే బోధపడ్తుంది. సృష్టిలోనే వున్నదీ పక్షపాతం. జీవి పుట్టి పెరిగి రెక్కలు వచ్చేవరకు తల్లిదండ్రులు దాని అభివృద్ధికే అహర్నిశలు కష్టపడ్తారు. ఇంతెందుకు అల్పజంతువైన కోడిని ఉదాహరణగా తీసుకోండి. గ్రుడ్లని పొదిగి పిల్లల్ని చేయడానికి అన్నాహారాలు మాని తనలోని శక్తిని, పుష్టాన్ని ధారపోస్తుంది. అలా చెయ్యమని, తమకి ప్రాణం పొయ్యమని ఆ గ్రుడ్లు తల్లి పక్షిని కోరలేదు కదా!"

"నీ సామ్యం చక్కగా వుంది అనూ! ఇంతకీ నువ్వు కోడిపెట్టవన్నమాట" అంటూ నవ్వారు విశ్వనాథంగారు.

"సృష్టిలోని విచిత్రాన్ని చెప్తున్నానండి" అంటూ తమూ నవ్వింది అన్నపూర్ణ.

"అయితే మన యాత్రా స్పెషల్‌కి పురిటిలోనే సంధి కొట్టిందన్నమాట" అంటూ లేచారు విశ్వనాథంగారు.

"మీరేమైనా అనండి-నా మట్టుకు నాకు పిల్లల మనస్సుల్ని నొప్పించి యాత్రలకి వెళ్ళాలని లేదు. తర్వాత మీ ఇష్టం" అంటూ వంటింట్లోకి వెళ్ళింది అన్నపూర్ణ.

అన్నపూర్ణ మృదు స్వభావాన్ని, ఆవిడలోని సహృదయాన్ని కమ్మగా వూహించుకుంటూ బాల్కనీకేసి నడిచి వెళ్ళారు విశ్వనాథంగారు.

తమ ఉత్తరదేశ యాత్రని రద్దుచేసికొని, వాళ్ళ కోర్కెలు తీర్చే ప్రయత్నంలో వున్నామన్న శుభవార్తని పిల్లలకు చెబ్దామని ఎంతో ఉత్సాహంతో పిల్లల రూం దగ్గరకి వచ్చిన విశ్వనాథంగారు వాళ్ళ గదిలోంచి వినవస్తున్న మాటలకు ఆగిపోయారు.

"ఎలాగయినా నాన్నగారు చాలా మారిపోయారురా మురళీ! లేకుంటే మీ బావగారు అంత కష్టపడ్తున్నారు కదా! ఆ విషయమై ఎన్నోమార్లు చెప్పాను నాన్నకి. పోనీ నాన్నకి తెలియకుంటే అమ్మయినా చెప్పచ్చుగా..." పూర్ణిమ కంఠం కోపంగా పల్కుతూంది.

"ఊ...అమ్మ మాత్రం ఏం తక్కువలే...మొన్న ఎదురింటి పిన్నిగారు యాత్రలకి వెళ్ళివచ్చినప్పటి నుండి అమ్మకి కూడా యాత్రల పిచ్చి బాగా పట్టుకుంది. లేకుంటే సింగపూర్ వెళ్ళాలని నేనెంతగా సరదా పడ్తున్నానో తెలియదా? అయినా నేను సింగపూర్ వెళ్ళేది ప్లెజర్ ట్రిప్పకి కాదుకదా! ఎఫ్.ఎం.జి. కూడా రాస్తే నా భవిష్యత్తుకి ఎంత మంచిది" హౌస్ సర్జెన్సీ చేస్తున్న మెడికో మురళి ఆక్రోశ అది.

"అమ్మలు అంతేరా బ్రదర్. ఎంతసేపూ పాత చింతకాయ పచ్చడి లాగ పూజలు పునస్కారాలు పుణ్య క్షేత్రాలు అంటారు. అందుకేరా నేనన్నది ఈ అటాచ్‌మెంట్స్, టైస్-అన్నీ థ్రాష్. ఫ్రీ బర్డ్సులాగ బ్రతికేయాలి" ఇప్పటికీ పాకెట్ మనీకి తల్లిదండ్రులపై ఆధారపడే పద్ధెనిమిదేళ్ళ సుపుత్రుడు కుమార్ భావాలవి.

ఇంకా అక్కడ నిలబడితే ఎన్నెన్ని అప్రియమైన మాటల్ని వినవలసి వస్తుందో అన్న భయంతో నెమ్మదిగా అక్కడి నుండి కదిలారు విశ్వనాథంగారు.

తన గదిచేరి ప్రక్కమీద వాలిన విశ్వనాథంగారు ఆలోచనల్లో పడ్డారు. తన సంతానానికి తన మీద, ముఖ్యంగా పిల్లల ఆనందమే తన ఆనందంగా భావించే తల్లిమీద ఎంత ప్రేమ వున్నదో అర్థమయింది. అన్నపూర్ణ చెప్పిందే నిజమా! పిల్లలని పెంచి తమ ప్రేమల్ని,ఆస్తుల్ని పంచడం వరకే తమ బాధ్యతా...తరువాత ఏమీ కోరకూడదా...కనీసం వృద్ధులవుతున్న, తమపట్ల కాసింత కరుణ-దయ-ప్రేమ- సానుభూతీ!

పనులన్నీ పూర్తి చేసుకుని భర్త దగ్గరికి వచ్చిన అన్నపూర్ణ ఇంకా నిద్రపోకుండా మేల్కొని వున్న భర్తని చూచి విస్తుపోయింది. భర్తని పల్కరిద్దామా-వద్దా అన్న ఆలోచనని విస్మరించి, దైవ ప్రార్థన చేసి పక్కమీదకి ఒరిగింది అన్నపూర్ణ.

* * *

బాల్కనీలో కూచుని దినపత్రికని తిప్పతూ కాఫీ సిప్ చేస్తున్నారు విశ్వనాథంగారు. అన్నపూర్ణ కూడా కాఫీ గ్లాస్ చేతపట్టుకుని భర్త దగ్గరికి వచ్చి కూచుంది. భార్యా భర్త లిద్దరూ ప్రశాంతంగా కూచుని కబుర్లు చెప్పకునేది కూడా అప్పడే. సంతానానికి అంత తొందరగా తెల్లవారదు.

కాఫీ త్రాగుతూనే భర్త రాత్రి నుండి ముభావంగా వుండడంలోని ఆంతర్యాన్ని గురించి ఆలోచిస్తూంది అన్నపూర్ణ. యాత్రలకి తను రానన్నానని కోపంగానీ రాలేదుకదా! పల్కరిద్దామని భర్తవేపు చూచింది అన్నపూర్ణ. విశ్వనాథంగారి చూపులు తమ ఇంటి కాంపౌండు ఆవల కొత్తగా లేస్తున్న అపార్టుమెంట్ బేస్‌మెంటులో టెంపరరీగా నివాసముంటున్న పనివాళ్ళ గుడిసెలమీద నిలిచాయి. గుడిసెల చుట్టూ గుణగుణా తిరుగుతున్న తల్లి కోడి-దానికి కొంచెం దూరంలో ఇప్పడిప్పడే పెద్దవవుతున్న దాని పిల్లలు. తల్లికోడి తన మేతను ఏరుకుంటూంది. అలవాటుకొద్దీ తల్లి వద్దకు గింజలకై వచ్చే పిల్ల కోళ్ళని తరిమి తరిమి కొట్టూంది. మేతను పిల్ల కోళ్ళకి అందనివ్వడం లేదు.

భార్యా భర్త లిద్దరూ అటుకేసి చూసారు.

"చూసావా అనూ! నిన్న రాత్రి నువ్వు అన్నావు గుర్తుందా? కోడి తన గ్రుడ్లని ఎంతో స్వార్థరహితంగా పొదిగి ఆపైన కంటికి రెప్పలా వాటిని గద్దల, కాకుల బారి నుండి రక్షిస్తూ పిలిచి పిలిచి ధాన్యపు గింజల్ని తినిపిస్తూ పెద్ద చేస్తుందని. మరి ఇక్కడ చూశావా? మీ బ్రతుకులు మీరు బ్రతకండని తరిమి తరిమి కొట్టూంది!"

భర్త ఇలా ఎందుకంటున్నారో అర్థం కాలేదు. "అయితే...ఏవిటి మీరనేది?" అంది అన్నపూర్ణ ఇంకేమనాలో తోచక.

"నేను అంటున్న దేవిటో తెలుసా? అల్పప్రాణి అయిన ఆ కోడికి వున్న ఆలోచన, విచక్షణ, ఉన్నత ప్రాణులమైన మన మానవ జీవులకు లేవు అంటాను. ఎంతసేపూ పిల్లలు...పిల్లలు. బాగానే వుంది. కన్నాము కనుక పోషించాలి. వాళ్ళ పురోభివృద్ధికి పాటుపడడం మన ధర్మం. వాళ్ళ బాధ్యత బరువుల్ని మోయాలి-కాదనను. కానీ ఎంతవరకు? వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు నిలబడే వరకే. మన భవిష్యత్ జీవితాన్ని పట్టించుకోకుండా ఎంతసేపూ అయ్యో పిల్లలంటూ వున్నదంతా ఎత్తిపోసి చిన్న చిన్న సరదాలని కూడా చంపుకొని బ్రతకడం అవివేకం" ఆవేశంగా మాట్లాడుతున్న భర్తను చూసి హడలిపోయింది అన్నపూర్ణ. చిలికి చిలికి గాలివాన అయినట్టు-ఈ బోనస్ డబ్బు కాదుకానీ- అనవసరంగా ఈయన మనస్సు గాయపడిందే అన్పించింది అన్నపూర్ణకి.

"కావాలంటే పిల్లలకు నచ్చచెప్పి అలాగే వెళ్దాంలెండి యాత్రలకి" అనునయంగా అంది అన్నపూర్ణ.

రాత్రి పిల్లలు తమ ఇద్దర్ని గురించి మాట్లాడిన కటువు మాటల్ని మళ్ళీ భార్య దగ్గర వల్లె వేయడానికి మనస్కరించక వ్యాకులపడుతున్న భర్తవేపు జాలిగా చూసింది అన్నపూర్ణ.

"నిజం అనూ! ఈ యాత్రల విషయమే కాదు. మన భవిష్యత్తు గురించి కూడా మనం ఆలోచించడం మంచిదంటాను నేను. వృద్ధాప్యంలో డబ్బుకు ఇబ్బంది పడక సుఖంగా ఎవ్వరి మీద ఆధారపడకుండా గౌరవప్రదంగా బ్రతకాలంటే మనం కూడా ఆ కోడిలాగా కొంత స్వార్థాన్ని అవలంబించాలి."

"సరేలెండి! ఇప్పడవన్నీ ఎందుకు? మనం యాత్రా స్పెషల్లో బయల్దేరుతున్నాము. రెండు నెలలు పిల్లల్ని విడిచిపెట్టి వుండడం అంటే మాటలా! ఎంత పని...ఎన్నెన్ని ఏర్పాట్లు చేయాలి!" హడావిడిగా లేచి వెళ్తున్న భార్యకేసి చూస్తూ వుండిపోయారు విశ్వనాథంగారు. ●




లాకర్ నెం.36

కొత్త సీరియల్ త్వరలో ప్రారంభం!